తెలంగాణ భవన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించిన మాదిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి, మందడి సుధాకర్‌రెడ్డి నగరంలో ఆయనను కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు.

– బాలానగర్, డిసెంబర్ 2

కామన్‌వెల్త్ క్రీడల్లో విద్యార్థినికి సిల్వర్ మెడల్

హైదర్‌నగర్ డివిజన్ ఆదిత్యనగర్‌కు చెందిన బిళహరి కామన్‌వెల్త్ క్రీడల్లో సిల్వర్ మెడల్ సాధించింది. నవంబర్ 29,30న దక్షిణాఫ్రికా దర్బన్‌లో జరిగిన కామన్‌వెల్త్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో అండర్-11 విభాగంలో తెలుగు రాష్ట్రాల నుంచి ముగ్గురు చిన్నారులు పోటీ పడగా.. బిళహరి అత్యుత్తమ ప్రతిభను కనబరిచి సిల్వర్ మెడల్‌ను కైవసం చేసుకున్నది. ఈ మేరకు అక్కడి పోటీల నిర్వాహకులు ఆమెకు మెడల్‌ను అందించారు.

– మియాపూర్, డిసెంబర్ 2

10జీపీఏ సాధిస్తే.. రూ.లక్ష బహుమతి

● కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు

బాలానగర్, డిసెంబర్ 2: సాంకేతిక విద్యను అందిపుచ్చుకొని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని హస్మత్‌పేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచించారు. సోమవారం ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ పరిధిలోని హస్మత్‌పేట ప్రభుత్వ పాఠశాలలో బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్, సిర్రస్ ల్యాబ్స్ సంయుక్త సహకారంతో ఎనిమిది కంప్యూటర్లు డొనేట్ చేసిన సందర్భంగా స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్, సిర్రస్ ల్యాబ్స్ సంస్థల ప్రనిధులు పొడిశెట్టి కృష్ణ, వెంకటేశ్, ప్రేంకుమార్‌ను అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కంప్యూటర్ల ద్వారా సాంకేతిక రంగంలో రాణించాలని సూచించారు. 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షరాసే విద్యార్థులు 10 గ్రేడ్ పాయింట్లతో పూర్తి స్థాయిలో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. 10/10 గ్రేడ్ వచ్చిన విద్యార్థినీ విద్యార్థులకు రూ.లక్ష బహుమతిగా ఇస్తానని ప్రకటించారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలన్న ముఖ్య ఉద్దేశంతో బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్, సిర్రస్ ల్యాబ్స్ సంస్థలు ముందుకు రావడం హర్షణీయం అన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్‌గౌడ్, కర్రె జంగయ్య, మక్కల నర్సింగ్, ఇర్ఫాన్, హరి నాథ్, తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

నాయీ బ్రాహ్మణుల సెలూన్లకు ఉచిత కరెంట్ ఇవ్వాల్సిందే..

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 2: కుల వృత్తిని నమ్ముకుని జీవనాన్ని సాగిస్తున్న నాయీ బ్రాహ్మణుల సెలూన్లకు ఉచిత కరెంట్ ఇవ్వాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు డిమాండ్ చేశారు. సోమవారం క్యాంపు ఆఫీస్‌లో ఎమ్మెల్యే కృష్ణారావును కూకట్‌పల్లి నియోజవర్గానికి చెందిన నాయీ బ్రాహ్మణ సంఘం నేతలు కలిశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో నాయీ బ్రాహ్మణుల సెలూన్‌లకు ప్రతి నెల 200 యూనిట్ల విద్యుత్‌ను ఉచింతంగా సరఫరా చేసేవారని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక.. సెలూన్లకు ఉచిత విద్యుత్ ఇవ్వడంలేదన్నారు. సెలూన్లకు సంబంధించిన విద్యుత్ బిల్లులు చెల్లించాలని విద్యుత్ అధికారులు వేధిస్తున్నారని, దీంతో నాయీ బ్రాహ్మణులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సెలూన్ల ఉచిత విద్యుత్ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి.. సెలూన్లకు ఉచిత విద్యుత్‌ను కొనసాగించేలా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో కులవృత్తులను ప్రోత్సహించే దిశగా.. నాయీ బ్రాహ్మణుల సెలూన్‌లకు ఉచిత విద్యుత్‌ను సరఫరా చేయడం జరిగిందన్నారు. నేను కాంగ్రెస్ ప్రభుత్వం నాయీ బ్రాహ్మణుల సెలూన్‌లకు ఉచిత విద్యుత్ సమస్యను పట్టించుకోకపోవడం బాధకరమన్నారు. గతంలో ఇచ్చిన మాదిరిగానే.. సెలూన్‌లకు ఉచిత విద్యుత్‌ను ఇవ్వాలన్నారు. నాయీ బ్రాహ్మణులు కాకుండా ఇతర కులాల వారు పెట్టే హైటెక్ సెలూన్‌లను ప్రభుత్వం ప్రోత్సహించవద్దని, కులవృత్తిని నమ్ముకుని జీవించే నాయీ బ్రాహ్మణులే సెలూన్‌లు పెట్టేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే మంగళవారం (నేడు) మేడ్చల్ జిల్లా నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు నర్సింహ నాయీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వేదికగా నిర్వహిస్తున్న నాయీ బ్రాహ్మణుల ధర్నాకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు.

కూకట్‌పల్లి క్యాంపు ఆఫీస్‌లో నాయీ బ్రాహ్మణ సంఘం నేతలతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేర్ హాస్పిటల్‌లో అరుదైన శస్త్రచికిత్స

కెనడాకు చెందిన నర్సు కడుపులోంచి 52 ఫైబ్రాయిడ్లు తొలగింపు

శేరిలింగంపల్లి, డిసెంబర్ 2: కెనడాకు చెందిన నర్సు(42)కు ఫైబ్రాయిడ్ సర్జరీ నిర్వహించిన గచ్చిబౌలి కేర్ హాస్పటల్ వైద్యబృందం ఆమె కడుపులోంచి భారీ పరిమాణంలో ఉన్న 52 ఫైబ్రాయిడ్లు తొలగించారు. గచ్చిబౌలి కేర్ హాస్పిటల్‌కు చెందిన ప్రముఖ గైనకాలజిస్టు ప్రభ అగర్వాల్‌ను కెనడాకు చెందిన నర్సు(42) ఇటీవల సంప్రదించింది. గత 3 నెలలుగా కడుపులో ఇబ్బందులు పడుతూ తినడం కష్టంగా మారిందని, కొద్దిరోజులుగా మూత్ర విసర్జన సైతం తగ్గిపోతూ అనేక ఇబ్బందులను వస్తున్నాయంటూ డాక్టర్ అగర్వాల్‌ను సంప్రదించగా ఏంఆర్ఐ తీసిన వైద్యులు భారీ పరిమాణంలో ఫైబ్రాయిడ్లు ఉన్నట్లు గుర్తించి ఇటీవల విజయవంతంగా నర్సుకు శస్త్రచికిత్స చేశారు. కడుపులోంచి భారీ పరిమాణంలో ఉన్న 52 ఫైబ్రాయిడ్లు తొలగించి అరుదైన చికిత్సను క్లిష్ట పరిస్థితుల్లో విజయవంతం చేసినట్లు కేర్ హాస్పిటల్ గైనకాలజిస్టు ప్రభ అగర్వాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంతో శ్రమించి తమ బృందం ఈ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించామని పేర్కొన్నారు.

సేవాదృక్పథంతో ముందుకుసాగాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర అడిషనల్ డీజీపీ(ఇంటలిజెన్స్) శివధర్‌రెడ్డి

శేరిలింగంపల్లి, డిసెంబర్ 2: సమాజంలో ఆర్థికంగా స్థిరపడినవారు సేవాదృక్పథంతో ముందుకుసాగాలని, నిరుపేదలకు సేవలు విస్తృత పరచాలని తెలంగాణ రాష్ట్ర అడిషనల్ డీజీపీ(ఇంటలిజెన్స్) శివధర్‌రెడ్డి అన్నారు. సోమవారం గోపన్‌పల్లిలో రోటరీక్లబ్ ఆఫ్ హైదరాబాద్, రోజ్ చారిటబుల్ ట్రస్టుల సంయుక్త అధ్వర్యంలో నిర్వహించిన ''ఆలంబన'' కార్యక్రమం మొదటి వార్షికోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయిన నిరుపేద కుటుంబాల చిన్నారులకు చేయూతను అందిస్తూ నాణ్యమైన విద్యను అందించడం అభినందనీయమని అన్నారు. ఈ దిశగా ఆలంభన కార్యక్రమం ద్వారా సమాజంలో సేవలు విస్తృత పరచడం, నిరుపేద కుటుంభాల అనాథ పిల్లలకు తగిన సహాయ సహకారాలు అందిస్తూ ముందుకు సాగుతుండటం శుభపరిణామమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఫ్లాగ్ షిప్ ప్రాజెక్టు కమిషనర్ శశాంక్, రోటరీ ఫౌండేషన్ చైర్మన్ ప్రభాకర్, వ్యవస్థాపక అధ్యక్షుడు దేవ్ అమర్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రధానోపాధ్యాయుల సమావేశం

దుండిగల్, డిసెంబర్ 2: తెలంగాణ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం (ట్రస్మా) మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం హెడ్మాస్టర్ల కాన్ఫరెన్స్ జరిగింది. సూరారంలోని వీఐపీ ఫంక్షన్ హాల్‌లో ఎనర్జీ టు సిసర్జీ న్యూడైరెక్షన్స్-2025 అనే అంశంపై పాఠశాలల యాజమాన్యం, హెడ్మాస్టర్లకు ఒక్క రోజు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూ డైస్ ప్లస్ తోపాటు ఇతరత్రా ఆన్‌లైన్, ఆపార, ఎన్ఈపీ సమస్యలపై సమగ్రంగా అధికారులు వివరించారు. ఆన్‌లైన్ పనులను ఏ మాత్రం నిర్లక్ష్యం చేయొద్దని తెలిపారు. ఎప్పటికప్పుడు అప్డేట్స్‌ను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత సిబ్బంది దృష్టికి తీసుకురావాలని కోరారు. స్టేట్ ప్లానింగ్ కో-ఆర్డినేటర్ మురళీ కృష్ణ, మేడ్చల్ జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి రవీందర్ రాజు, ఏహెచ్‌పీఎస్ రీజినల్ డైరెక్టర్ కౌశిక్ రెడ్డి, విస్బిలిటీ ఆఫ్ లెర్నింగ్ మెంటార్ అండ్ ట్రైనర్ రఘురామ్ వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. పలు అనుమానాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ ఎన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రైవేట్ యాజమాన్యాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వం తీసుకువచ్చే నూతన ఆన్‌లైన్ అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ట్రస్మా మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు కె.రామేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, రాష్ట్ర నాయకులు రాంచంద్రయ్య, చింతల మల్లేశ్, హన్మంతారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు సరుకులు.. దుప్పట్ల పంపిణీ

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 2: కేపీహెచ్‌బీ కాలనీ వసంతనగర్‌లోని సేవ్ ఏ లైఫ్ సేఫ్టీ ఫర్ హ్యూమానిటీ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రాణా ప్రతాప్ ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ కాలనీ 4వ ఫేజ్‌లోని నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు, దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నేతలు అరుణాకుమారి, పూర్ణచందర్‌రావు, నాగదుర్గ దంపతులు, శంకర్‌రావు, సుజాత, భవాని, భారతి, రమాదేవి, కాంతమ్మ, కన్నలత, వెంకటలక్ష్మి, సరస్వతి తదితరులు ఉన్నారు.

దివ్యాంగుడికి లయన్స్ క్లబ్ ఆర్థిక సహాయం

మాదాపూర్, డిసెంబర్ 2: హఫీజ్‌పేట్‌కు చెందిన కృష్ణ దివ్యాంగుడు అనారోగ్య సమస్యలతో బాధపడుతుండగా చికిత్స నిమిత్తం లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ చేయూతగా నిలిచింది. చందానగర్‌లోని హుడా కాలనీలో క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండా విజయ్ కుమార్ చేతుల మీదుగా సోమవారం రూ.10 వేల నగదు అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు బి.మధుసుదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సింగరెడ్డి శాంతిభూషన్‌రెడ్డి, మర్కా మల్లేశ్ యాదవ్, మారం ప్రసాద్, సింగదాసరి రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

పర్యావరణ హిత కార్తికమాస వనభోజనాలు

దుండిగల్, డిసెంబర్ 2: నిజాంపేట్ జర్నలిస్ట్స్ కాలనీ సమీపంలోని చెర్ల ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో పర్యావరణహిత కార్తికమాస వనభోజన సమారాధన జరిగింది. పతాంజలి యోగాబృందం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో పెద్దసంఖ్యలో పర్యావరణ ప్రేమికులు పాల్గొన్నారు. రిటైర్డ్ జడ్జి జనార్దన్, యోగా మాస్టర్లు శ్రీలక్ష్మి, మల్లికార్జున్, పుర ప్రముఖులు నాగేశ్(సన్నీ) ఈశ్వర్‌కిరన్, లక్ష్మారెడ్డి, ప్రేం, భూపాల్‌రెడ్డి, రమేశ్, కనకవర్ధిని, కిశోర్, సుబ్బరాజు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మంచి నడవడికతో మెరుగైన లక్ష్యసాధన

జగద్గిరిగుట్ట, డిసెంబర్ 2: కాలేజీస్థాయిలో క్రమశిక్షణతో మెలిగితే జీవితాంతం ఉత్తమ పౌరులుగా కొనసాగుతారని బాలానగర్ సీఐ నర్సింహరాజు సూచించారు. రంగారెడ్డినగర్ డివిజన్ ఏపీహెచ్‌బీ కాలనీలోని గౌతమి డిగ్రీకాలేజీలో సోమవారం ర్యాగింగ్, సైబర్‌క్రైం, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. సహ విద్యార్థులతో సహాయం చేసేలా వ్యవహరిస్తే మనకూ అవసరమైన సందర్భాల్లో చేయూత ఉంటుందన్నారు. కంప్యూటర్, సెల్‌ఫోన్ వినియోగం సాధారమైన నేపథ్యంలో సైబర్‌క్రైం, సోషల్‌మీడియాల్లో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా ట్రాఫిక్‌రూల్స్ పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగరాజు, కాలేజీసిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

వరదనీటి కాలువ పనులు సకాలంలో పూర్తి చేయాలి

బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి

బాలానగర్, డిసెంబర్ 2: వరదనీటి కాలువ పనులను సకాలంలో పూర్తి చేయాలని బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం డివిజన్ పరిధిలోని వినాయక్‌నగర్‌లో జరుగుతున్న వరదనీటి కాలువ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాల కాలంనుంచి రాజుకాలనీ, సాయినగర్, వినాయక్‌నగర్ కాలనీల వర్షపునీరు పంచవటి అపార్ట్‌మెంట్ వద్ద నిలిచిపోయి కాలనీవాసుల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతున్నందున వరదనీటి కాలువ పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఆయా పనుల్లో జాప్యం ఏర్పడితే కాలనీవాసులు ఇబ్బందులు పడనున్న తరుణంలో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏతః సునీల్, రాములు, శివరెడ్డి, రత్నం, చంద్రశేఖర్ గుప్తా, నర్రా విజయేంద్రరెడ్డి, గౌతమ్, ఆవుల గ్రీష్మంత్‌రెడ్డి, సోఫీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి: కార్పొరేటర్ సబీహాబేగం

అల్లాపూర్, డిసెంబర్ 2: స్థానికంగా నెలకొన్న సమస్యలపై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు అధికారులు వెంటనే స్పందించి సత్వరమే సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని కార్పొరేటర్ సబీహాబేగం అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని గాయత్రినగర్, పర్వత్‌నగర్ నెలకొన్న సమస్యలు తెలుసుకుందుకు అధికారులతో కలిసి కార్పొరేటర్ పర్యటించారు. పర్వత్‌నగర్ నుంచి గాయత్రినగర్ వెళ్లే మార్గంలో చెత్త పేరుకుపోయి తీవ్రదుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. సత్వరమే రోడ్డుపై పేరుకుపోయిన చెత్తను తొలగించాలని శానిటేషన్ విభాగం అధికారులను ఆదేశించారు. కార్పొరేటర్ ఆదేశాల మేరకు శానిటేషన్ సిబ్బంది చెత్తను తొలగించడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తంచేశారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయి

క్రీడలను ప్రారంభిస్తున్న పేట్‌బషీరాబాద్ సీఐ విజయ్‌వర్ధన్, ఎస్ఐలు, నిర్వాహకులు

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 2: క్రీడలు వ్యక్తిత్వ ధృఢత్వంతో పాటు మానసికోల్లాసానికి దోహదం చేకూరుస్తాయని పేట్‌బషీరాబాద్ సీఐ విజయవర్ధన్ తెలిపారు. సోమవారం కొంపల్లిలో ఫైన్ క్యాబ్ క్రికెట్ మైదానంలో గిర్జా శంకర్ దీక్షిత్ కప్ క్రీడలు ప్రారంభమయ్యాయి. ఈ క్రీడల్లో గురునానక్ హైస్కూల్, సియోన్, ముంబై, దీక్షిత్ క్రికెట్ అకాడమీ హైదరాబాద్ జట్లు మూడు మ్యాచ్‌లు సిరీస్ ఆడనున్నాయి. ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడలపై మక్కువ సాధించుకొని ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతను ఎంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దీక్షిత్ అకాడమీ నిర్వాహకులు, ఆయా స్కూళ్ల అధ్యాపకులు, క్రీడాకారులు పాల్గొన్నారు

ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణం

చర్యలు తీసుకోవాలని తాసీల్దార్‌కు ఫిర్యాదు

దుండిగల్, డిసెంబర్ 2: గండిమైసమ్మ-దుండిగల్ మండల పరిధి బౌరంపేట్‌లోని సర్వే నంబర్ 166 ప్రభుత్వ భూమికి సంబందించిన రికార్డులను 166/22గా మార్చి అధికారుల నుంచి ఎటువంటి ఎన్ ఓసీ తీసుకోకుండా నిర్మించిన ఓ ప్రైవేట్ కళాశాల భవనాలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక బీజేపీ నేతలు సోమవారం తాసీల్దార్ మతిన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భవన నిర్మాణదారులు హెచ్ఎండీఏ నుంచి గానీ, మున్సిపల్ నుంచి గాని ఎలాంటి అనుమతులు పొందలేదన్నారు. అయినప్పటికీ రెండెకరాల స్థలంలో బహుళ అంతస్తుల భవనం నిర్మించారని, ఈ విషయంలో తాము గత మూడు నెలల క్రితమే సమాచార హక్కు చట్టం కింద మున్సిపల్ కమిషనర్‌ను కోరగా.. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని చెప్పారు. అధికారులు అలసత్వంతో ప్రభుత్వ ఆస్తులకు, ప్రభుత్వ ఖజానాకు పెద్ద గండి పడుతుందన్నారు. దీనిపై ఉన్నతస్థాయి విచారణ జరిపి, ప్రజా ఆస్తులను కాపాడాలని, తాతలనాటి నుంచి ఆధీనంలో ఉన్న రైతులకు కూడా ఎన్ఓసీలు ఇచ్చి పాసు పుస్తకాలు అందజేయాలని కోరారు. తాసీల్దార్‌ను కలిసి ఫిర్యాదు చేసిన వారిలో బౌరంపేట్ బీజేపీ నాయకకులు పీసరి కృష్ణారెడ్డి, దమ్మగారి ప్రభాకర్‌రెడ్డి, నల్ల రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి

జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్‌కు వినతి

దుండిగల్, డిసెంబర్ 2: బాలానగర్-నర్సాపూర్ హైవేపై జీడిమెట్ల బస్ డిపో నుంచి సూరారం చౌరస్తా వరకు ఉదయం స్కూళ్లకు, కాలేజీలకు వెళ్లే వాహనాలతో పాటు పరిశ్రమలకు వెళ్లే బస్సులు, ఇతర వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలంటూ బీజేపీ నేతలు జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉదయం, సాయంత్రం రద్దీవేళల్లో జీడిమెట్ల బస్ డిపో నుంచి సూరారం చౌరస్తా వరకు తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. సుమారు రెండు కిలోమీటర్ల మేర నిత్యం ట్రాఫిక్ జామ్ అవడంవల్ల ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయంలో ట్రాఫిక్ పోలీసులు చొరవచూపి సమస్యకు శాశ్వతంగా పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంలో ట్రాఫిక్ సీఐ స్పందిస్తూ ట్రాఫిక్‌జామ్ అవ్వకుండా చూడటానికి తమ సిబ్బంది ఎప్పుడు ముందుంటామని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు జీ.సత్తిబాబు, జిల్లా ఇండస్ట్రీయల్ సెల్ కన్వీనర్ గిరిబాబు, సుభాష్‌నగర్ డివిజన్ జనరల్ సెక్రెటరీ శాంపూర్ విజేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పోల్కం విగ్నేశ్ ముదిరాజ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కొంపల్లిలో అంబేద్కర్ స్టడీ సెంటర్‌కు స్థలం కేటాయించాలని వినతి

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 2: నిరుపేద విద్యార్థులకు, నిరుద్యోగులకు తమ జీవిత లక్ష్యాన్ని చేరేందుకు కొంపల్లిలో డా.బీఆర్.అంబేద్కర్ స్టడీ సెంటర్ ఏర్పాటు కోసం 500 గజాల స్థలాన్ని కేటాయించాలని కోరుతూ.. సోమవారం మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు కొంపల్లి మాజీ సర్పంచ్ జెమ్మి దేవేందర్ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొంపల్లి గ్రామపంచాయితీ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయిన తర్వాత దశాబ్దం కాలం నుంచి ఈ ప్రాంతంలో ఎంతో మంది నిరుద్యోగులు, విద్యార్థులు ఉద్యోగ అవకాశాల కోసం అన్వేషణ చేస్తున్నారన్నారు. మారుమూల గ్రామాల నుంచి వచ్చి అధిక మొత్తంలో కిరాయిలు చెల్లించి చదువులను కొనసాగిస్తున్నారని, అలాంటి వారి సౌలభ్యం కోసం కొంపల్లిలోని అపర్ణ ఫామ్‌గ్రోస్‌లో మిగిలి ఉన్న ప్రభుత్వ స్థలాలో 500 గజాల స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఈ స్థలంలో డా.అంబేద్కర్ ఎడ్యుకేషనల్ స్టడీ సర్కిల్, లైబ్రరీ, ఆడిటోరియంలో నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. దీనికి జిల్లా అడిషనల్ కలెక్టర్ విజేందర్‌రెడ్డి స్పందిస్తూ త్వరలో సంబంధిత అధికారులతో సందర్శించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు సన్న శ్రీనివాస్, జి.రామ్‌ప్రసాద్ తదితరులు ఉన్నారు.

మేడ్చల్ కలెక్టరేట్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న కొంపల్లి మాజీ సర్పంచ్ జెమ్మి దేవేందర్ తదితరులు

కూకట్‌పల్లి జోన్ ప్రజావాణికి.. 35 ఫిర్యాదులు

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 2: కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 35 ఫిర్యాదులు వచ్చినట్లు జడ్సీ అపూర్వచౌహాన్ తెలిపారు. సోమవారం జోన్ ఆఫీస్‌లో నిర్వహించిన ప్రజావాణిలో టౌన్‌ప్లానింగ్ విభాగానికి 22 ఫిర్యాదులు, ఇంజినీరింగ్ విభాగానికి 6, యూబీడీ విభాగానికి 3, వెటర్నరీ విభాగానికి 2, ఎలక్ట్రికల్ విభాగానికి 2 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి.. ఆయా సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ చిన్నారెడ్డి, సీపీ గణపతి, ఆయా విభాగాల జోనల్ అధికారులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి జోన్ ఆఫీస్ ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న జడ్సీ అపూర్వ్‌చౌహాన్

జంట సర్కిళ్ల కార్యాలయంలో..

కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ల కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 8 ఫిర్యాదులు వచ్చాయి. మూసాపేట టౌన్ ప్లానింగ్ విభాగానికి 8 ఫిర్యాదులు, శానిటేషన్ విభాగానికి 1, రెవెన్యూ విభాగానికి 1 ఫిర్యాదు వచ్చినట్లు డీసీ వంశీకృష్ణ తెలిపారు. కూకట్‌పల్లి సర్కిల్ కార్యాలయంలో ఎలాంటి ఫిర్యాదులు రాలేదని అధికారులు తెలపారు.

కోర్టులో కేసులున్నా... యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

● ప్రజావాణిలో ఫిర్యాదు

కొండాపూర్, డిసెంబర్ 2: కోర్టులో కేసు కొనసాగుతున్నా.. యథేచ్ఛగా అక్రమంగా ఆరంతస్తుల బహుళ అంతస్తుల భవన నిర్మాణం కొనసాగుతున్నప్పటికీ టౌన్‌ప్లానింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదంటూ స్థానికులు సోమవారం ప్రజావాణిలో శేరిలింగంపల్లి సర్కిల్ -20 ఉప కమిషనర్ ముకుందరెడ్డికి ఫిర్యాదు చేశారు. శేరిలింగంపల్లి మండల పరిధిలోని సర్వే నంబర్ 215లోని 5ఎకరాల 30 గుంటల ల్యాండ్‌పై రంగారెడ్డి జిల్లా కోర్టులో పార్టిషన్ షూట్ కేసు పెండింగ్‌లో ఉందని, కేసు నంబర్ 155/2002, ఇందులోని స్థలం అమ్మకాలు, కొనడం చేయవద్దని కోర్టు స్పష్టంగా చెప్పినప్పటికీ అక్రమంగా నిర్మాణాలు కొనసాగిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదంటూ వాపోతున్నారు. అక్రమ నిర్మాణాలపై ఇప్పటికే పదుల సంఖ్యలో ఫిర్యాదులు చేసినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లే